09112024-MAI-04_Layout 1 11/9/2024 2:42 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

మబ్బుల మాటున దాగి.. వెలుగుల మీద దాడి

'నేరమే అధికారమై ప్రజలను నేరస్థులను చేసి వెంటాడుతుంటే.. నోరుండి ఊరక కూర్చున్న ప్రతివాడూ నేరస్థుడే' అన్నాడో మహానుభావుడు. నేరమే అధికారం పంచన చేరి పసికూన తెలంగాణ గొంతు నులిమేస్తూ పట్టుబడ్డ ఒకానొక పాపిష్టి ఘటన ఇంకా మన జ్ఞాపకాల్లో సజీవంగా మెదులుతూనే ఉన్నది. 'మనవాళ్లు బ్రీఫ్‌డ్ మీ!' అని బ్యాక్‌గ్రౌండ్‌లో అధికార పీఠం మీది స్వరం గర్వంగా పలుకుతుండగా.. సూట్‌కేసుల నుంచి నోట్ల కట్టలు తీసి సర్దుతున్న నగ్న దృశ్యం మదిల కదలాడుతూనే ఉన్నది. అయినా.. ఇంకా 'చేపా చేపా ఎందుకు ఎండలేదు? అంటే.. గడ్డిమోపు అడ్డం వచ్చింది' అనే పాత కథనే విందామా? ఆ గడ్డిపోచను పట్టుకొని కథ మూలాల్లోకి వెళ్తేనే కదా..!

గడ్డిమోపు ఎందుకు అడ్డం వచ్చిందో? చేప ఎండిందో? లేదో? తెలిసేది. చీమల పుట్టలో వేలు పెట్టిన విలన్ ఎవరో తేలేది. అనవాళ్లు లేకుండా చేస్తామనే విద్వేషపు ప్రతిన నుంచి జనించిన కరెంటు కొనుగోళ్ల మీద కమిషన్, కేసీఆర్ చుట్టూ కుట్ర కథలు అల్లుతున్న వేళ.. నవ తెలంగాణ విద్యుత్తు ఫలాలు అనుభవించిన నాలాంటి వాడు ఊరక కూర్చుండి పోవటం నేర దృక్పథమే అవుతుంది. అందుకే కేసీఆర్ జమానాల వెలుగులు పంచిన కరెంటు పోళ్ల వరుసను తడుముకుంటూ పాడుబడ్డ తెలంగాణ మూలాల్లోకి వెళ్తున్నా...!

వర్ధెల్లి వెంకటేశ్వర్లు

ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వ్యవసాయ పంపుసెట్లకు నెలవారీ ఫిక్స్‌డ్ కరెంటు బిల్లు పెట్టిండ్రు. త్రీ హెచ్‌పీ (హార్స్ పవర్) పంపులకు రూ.18, ఫైవ్ హెచ్‌పీ పంపులకు రూ.25 చొప్పున బిల్లు కట్టాలని చెప్పిండ్రు. ఈ బిల్లు కట్టడానికి రైతులు నానా అవస్థలు పడేవాళ్లు. పుస్తెలు కుదవబెట్టి, దూడ పెయ్యలను అమ్మి కరెంటు బకాయిలు కట్టే టోళ్లు. లేకుంటే అదో అరాచకం. కరెంటోళ్లు బావుల మీద పడి మీటర్లు, స్టార్టర్లు గుంజుకు పోయేటోళ్లు.

త్రీ హెచ్‌పీ మోటరు పంపు నిరంతరాయం గా మూడు గంటలు పోస్తే.. నిక్కి నీల్గి అర్ధ ఎ కరా పొలం తడిసేది. కానీ, మోటర్ ఆన్ చేస్తే.. కాల్వకు పారిన నీళ్లు మడికి మళ్లకముందే కరెం టు పోయేది. కాల్వల నీళ్లు కాల్వలనే ఇంకిపోయేవి. అర్ధ గంటకో.. గంటకో కరెంటు మళ్లొచ్చేది. మోటరు స్టార్ట్ చేస్తే మళ్లీ పాత కథే. ఎక రా పొలంలో వరి పెడితే తాలు, బొందు పోనూ 12 క్వింటాళ్ల ధాన్యం ఎల్లితే మహా గగ నం. ఆ రోజుల్లో క్వింటాల్ వడ్ల ధర రూ.100 లోపే. అటు వంటి సంక్లిష్ట కాలంలో చంద్రబా బు ముఖ్యమంత్రి అయ్యిండు. ఎకాఎకిన త్రీ హెచ్‌పీ పంపు బిల్లు రూ.36, ఫైవ్ హెచ్‌పీ పంపు బిల్లు రూ.50కి పెంచుతూ ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనలను అదే ప్రభుత్వంలో ఉన్న కేసీఆర్ తీవ్రంగా ఆక్షేపించారు. ఆంధ్ర వ్యవసాయం, తెలంగాణ కాపురం రెండూ ఒకటి కాదని, తెలంగాణ రైతాంగానికి మోయలేనంత భారమైపోతుందని చంద్రబాబును నిలదీశారు.

కేసీఆర్ తిరుగుబాటుకు జంకిన చంద్రబాబు విద్యుత్తు చార్జీల పెంపు ప్రతిపాదనలను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. అప్పటి వ్యవసాయశాఖ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వర్‌రావును కలిసి మాట్లాడాలని కేసీఆర్‌కు సూచించారు. కేసీఆర్ ఆయన్ను కలిశారు. ఒక్కసారి కాదు, పదిసార్లు కలిసి మాట్లాడారు. కలిసిన ప్రతిసారి తన అభ్యంతరాలను విడమర్చి చెప్పారు. 'తెలంగాణ బతుకు బొంబాయి, దుబాయి, బొగ్గుబాయి అన్నట్టున్నది. ఇప్పటికే విపరీతమైన కరెంటు కోతలున్నయి. పంటలు ఎండిపోతున్నయి. జనం వలస పిట్టలై పోతున్నరు. మీ ఆంధ్ర తీరుగ మాకు పారే నీళ్లు లేవు. మాది బావుల మీది కాపురం. కరెంట్ బిల్లుల పెంపు వరి రైతుకు ఉరితాడు అయింది. వద్దు.. ఆ ప్రయత్నం సరికాదు. పెంపు ప్రతిపాదనలు ఆపండి' అని వడ్డే శోభనాద్రీశ్వర్‌రావు వద్ద కేసీఆర్ మొరపెట్టుకున్నరు.

ఆ రోజుల్లో తెలంగాణ వ్యవసాయాన్ని గమనిస్తే... ఖరీఫ్ సీజన్‌లో ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 20 వరకు అంటే దాదాపు 35 రోజులు, రబీలో మార్చి 20వ తారీఖు నుంచి ఏప్రిల్ 20 వరకు దాదాపు 30 రోజులు సాగు పీక్‌లో ఉండేది. పంట పొట్టకొచ్చి, గింజ పాలు బోసుకునే కాలమది. ప్రతి నీటిచెమ్మను ఒడిసిపట్టి మొక్కకు పోసే సమయం. రైతుకు నడుం లేప తీరిక ఉండదు. చెమట చుక్క కూడా వృథా పోకుండా చేనుకే అందాలన్నంత ఆరాటపడుతరు రైతన్నలు. సరిగ్గా అదే అదను మీద కరెంటు పోతది. 'ఇగొస్తది.. అగొస్తది' అని రైతులు కండ్లల్లో ఒత్తులేసుకొని ఎదురు చూస్తుంటరు. కరెంటు రాదు. కానీ, డీబు (ట్రాన్స్‌ఫార్మర్) కాలిపోయిందనే కబురొస్తది.

అప్పటికే పీకల దాకా అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి ఉంటరు. ఆ అచేతనం నుంచి ఏడు

పొస్తది. బతుకు మీద యావగింపు వస్తది. పలు చని కన్నీటి పొర కనురెప్పలను ఆవహిస్తది. ఆ మసక పొరల నుంచి చూస్తే.. ఉరితాళ్లో.. పురుగుల మందుడబ్బాలో కనిపించేయి. లేదంటే.. పొలం గట్టు కొనాకున పిల్ల బాటల్ల 'కరెంటు చార్జీలు దించాలె, ఏడు గంటల కరెంటు ఇయ్యాలె' అని పిడికిళ్లు ఎత్తి నినదించే ఎర్రజెండాలొళ్ల గొంతులు వినిపించేవి. అప్పటి కమ్యూనిస్టు కార్యాలయాలు ప్రజా పోరాటాల వాకిళ్లు. మడి తడిసేంత కరెంటే రైతాంగం ఆకాంక్ష. కరెంటు ఇస్తరు.. జెర్ర జెండాలు ఎత్తమని ఒక్క పిలుపిస్తే చాలు వేల మంది బీద బిక్కి, బక్క రైతులు లాఠీలకు, తూటాలకు ఎదురుబోయేది. ఒక్క డీబు కోసం రైతాంగం రోడ్డు మీద ధర్నా చేసి ఒళ్లంతా కుళ్లిపోయేటట్టు పోలీ సు లాఠీదెబ్బ లు తిన్న సంఘటనలు అప్పట్లో లెక్కకు మిం చి ఉండేవి.

వడ్డే శోభనాద్రీశ్వర్‌రావు ఏం చెప్పిండో.. చంద్రబాబు ఏం విన్నడో గానీ, కేసీఆర్ మాటకు విలువ ఇవ్వకుండా 2000 సంవత్సరంలో కరెంటు చార్జీలు పెంచుతూ ఉత్తర్వులు వచ్చినయి. పెంచిన కరెంటు చార్జీలు దించాలని సీపీఎం, సీపీఐ, న్యూ డెమోక్రసీ, ఇతర వామపక్షాలు ఇచ్చిన పిలుపుతో రైతులు కదిలారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో రైతు ప్రదర్శన జరిగింది. ఎటువంటి హెచ్చరికలు లేకుండా చంద్రబాబు ప్రభుత్వం కాల్పులకు తెగబడ్డది. హైదరాబాద్‌కు నెత్తుటి మరకలు అద్దుతూ రక్తాక్షరాలు రాసింది. చరిత్రలో జలియన్‌వాలాబాగ్ మారణకాండకు కారకుడైన జనరల్ డయ్యర్ తర్వాత మళ్లీ అంతటి నెత్తురు చరిత్ర రాసింది చంద్రబాబే. 25 వేల మంది రైతుల మీద కేసులు పెట్టింది నాటి టీడీపీ ప్రభుత్వం. అప్పుడు డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న కేసీఆర్ ఈ దుశ్చర్యను తీవ్రంగా ఆక్షేపించారు. ఇది మోసమని గర్జించారు. రైతు హంతక ప్రభుత్వంలో తాను కొనసాగలేనని బహిరంగ లేఖ రాశారు. బరి గీసి ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమానికి ముగ్గుపోశారు. గులాబీ జెండాకు రూపం ఇచ్చి రైతుల పక్కన నిలబడ్డారు. ఇదంతా జరుగుతున్న నాడు ప్రస్తుత సీఎం రేవంత్ క్రియాశీలక రాజకీయాల్లోనే లేరు.

ఎట్టకేలకు కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిండు. రాజ్యమైతే తెచ్చిండు గానీ.. అది కరెంటు కోతలతోటి కటిక చీకట్లు కమ్ముకున్న అంధ రాజ్యం. రైతు ఆత్మహత్యల పరంపర సాగుతున్న ఆపదల రాజ్యం. రావటం.. రావటంతోనే 5000 మెగావాట్ల విద్యుత్తు సంక్షోభాన్ని మూట కట్టి నెత్తి మీద పెట్టుకొని వచ్చింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణకు 53.89 శాతం, ఏపీకి 46.11 శాతం వాటాలు పంచిండ్రు. దీంట్లో మళ్ల దొంగలు మోపయిండ్రు. ఉమ్మడి రాష్ట్రంల ప్రైవేటు సంస్థల నుంచి 4000 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలు ఒప్పందం జరిగింది. తెలంగాణ రాష్ట్రం వచ్చి కేసీఆర్ సీఎం అయ్యాక లెక్క తీస్తే.. రోజువారీగా 1800 మెగావాట్ల విద్యుత్తు మాత్రమే వస్తున్నది. ఇందులో లీకేజీ లెక్కలు కూడా తీసుకుంటే సగటున 1600 మెగావాట్లు మాత్రమే లెక్కకు వచ్చేది. కానీ, డబ్బు మాత్రం నిండా 4000 మెగావాట్లకు కట్టాల్సిందేనట. అదేమంటే పీపీఏ (పవర్ పర్చేజ్ అగ్రిమెంట్) ఒప్పందమే అట్లా ఉన్నదని కరెంటు సంస్థలు వాదిస్తున్నయి. ఇదే అంశాన్ని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 2014 జూన్ 13న అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో చాలా నిర్వేదంతో ప్రస్తావించారు. 'కరెంటు ఇచ్చినా.. ఇవ్వకపోయినా 4000 మెగావాట్లకు మనం డబ్బులు చెల్లించాలి. ఇంతకన్నా ఘోరం ఉంటుందా? అధ్యక్షా..! ప్రజాధనం ఇంత అన్యాయంగా, ఇంత దుర్మార్గంగా దుర్వినియోగం అవుతుంటే ఎలా? అది మన ఖర్మా? ఆ పాపం మన నెత్తిమీద పడ్డది. ఇప్పుడు నేను వీళ్ల మీద విమర్శలకు పోయి కొట్లాడి కాలయాపన చేసుకోవాలా? అంత సమయం మనకుందా? అధ్యక్షా..! మన రాష్ట్రాన్ని మనం పునర్నిర్మాణం చేసుకునే పనిలో తలమునకలైన సమయాన్ని వృథా చేయదలుచుకోలేదు..' అని చెప్పారు. గత పాలకుల అవినీతిని క్షమించటం వెనుక రాష్ట్ర విద్యుత్తు సంక్షోభాన్ని సాధ్యమైనంత వేగంగా అధిగమించాలనే తపన మినహా.. ఆయనకు కించిత్ అపవాదునైనా ఆపాదించగలమా? కమిషన్లు.. ఎంక్వయిరీలు అంటూ కాలయాపనతో ప్రజలను మోసం చేయపూనుకుంటే ఆయనను ఆపటం మన తరం అయ్యేదా?

నాడు తెలంగాణ అంతా పీనుగుల కొంప అన్నట్టే ఉండె. రోజుకు నలుగురైదుగురు రైతుల ఆత్మహత్యలతోటి పల్లెలు తెల్లారేవి. ఒకరో ఇద్దరో రాత్రిపూట మోటరు పెట్టబోయి తేలో, పామో కరిచి మరణించేవాళ్లు. కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గాన్ని ఆనుకొని ఉన్న రాయపోలు మండలంలో ఎల్కంటి (ఎల్కల్) అనే ఊరుంటది. తిప్పి తిప్పి కొడితే 450 గడపలకు మించని చిన్న పల్లె అది. ఆ ఒక్క ఊరిలోనే అప్పటివరకు (2014లో తెలంగాణ వచ్చేవరకు) 35 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నరు. ఊరి పెద్ద ఎవరు? అని అడిగితే.. 35 మంది రైతులను మింగిన శ్మశానమే పెద్ద అని ఓ పెద్దమనిషి నిర్వేదంతో చెప్పిండు. కండ్ల ముందర ఇంతటి ఆపద పెట్టుకొని రాష్ట్ర పెద్దగా... ముఖ్యమంత్రి ఎటువంటి నిర్ణయం తీసుకోవాలి? యుద్ధంలో బ్రిగేడియర్ తరహా నిర్ణయమే అనివార్యం కదా..! కేసీఆర్ అదే చేశారు. నామినేషన్ పద్ధతిలో బీహెచ్ఈఎల్‌తో భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణ ఒప్పందం చేసుకున్నారు. విద్యుత్తు పవర్ ప్లాంటు నిర్మాణంలో దేశంలోనే 'ది బెస్ట్' ప్రభుత్వరంగ సంస్థ అది. అప్పటికే వారి వద్ద సబ్‌క్రిటికల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణానికి అవసరమైన యంత్రాలు సిద్ధంగా ఉన్నాయి. తెలంగాణకు అత్యవసరంగా కరెంటు అవసరం ఉన్నది. ఇంతకుమించిన మోకా ఇంకేం కావాలి. మరో ఆలోచన లేకుండా మణుగూరులో 1,080 మెగావాట్ల సామర్థ్యం గల భద్రాద్రి థర్మల్ పవర్‌ప్లాంటు నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నది. దేశంలోనే నెంబర్‌వన్ ప్రభుత్వరంగ సంస్థకు నామినేషన్ పద్ధతిలో ఇచ్చామా? టెండర్ పద్ధతిలో ఇచ్చామా? అనేది ఇక్కడ ప్రశ్నే కాదు. ఎట్లా ఇచ్చినా అది చట్టబద్ధమే. దీనిమీద రాద్ధాంతం చేయడం అంత బుద్ధిహీనమైన పని ఇంకోటి ఉండదు. తెలంగాణ రైతాంగ పరిస్థితి, పరిశ్రమల మనుగడ క్రిటికల్ పొజిషన్‌లో ఉన్నప్పుడు.. సబ్ క్రిటికల్, సూపర్ క్రిటికల్ అనే శాస్త్రీయ పదాల మీది తర్కం రైతు ఆత్మహత్యలను ఆపగలదా? ఆపదలో ఉన్న పారిశ్రామిక, వ్యవసాయరంగాలను ఆదుకోగలదా?

ఇంటి కరెంటు పుట్టి పావనకు రావటానికి కనీసం రెండేండ్ల సమయం పడుతుంది. ఈ రెండేండ్ల కాలం గట్టెక్కేదారి లెకుతున్న క్రమంలో పొరుగు రాష్ట్రం ఛత్తీస్‌గఢ్ దొరికింది. అప్పటికే అక్కడినుంచి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు కరెంటు కొనుక్కొని పోతున్నయి. కేసీఆర్ మనకో 2000 మెగావాట్లు బేరం జేసిండు. ముందుగాల 1000 మెగావాట్లు, అటెన్క మరో 1000 మెగావాట్ల కరెంటు ఇయ్యాలని ఒప్పందం కుదిరింది. ఇక్కడ ఇంకోమాట చెప్పాలి. తమిళనాడు రాష్ట్రం యూనిట్‌కు రూ.4.94 ధర పెట్టి కొన్నది. కర్ణాటక రాష్ట్రం యూనిట్‌కు రూ.4.33 ధరకు తీసుకున్నది. కానీ, కేసీఆర్ ఎటువంటి భేషజాలకు పోకుండా ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని బతిలాడో, బామాలో రూ.3.90కే యూనిట్ కరెంటు కొనుక్కొచ్చిండు. దీంతో వ్యవసాయ, పారిశ్రామిక, ఉత్పాదక రంగాలు విద్యుత్తు సంక్షోభం నుంచి బయటపడ్డయి. మెల్లమెల్లగా 24 గంటల కరెంటు పల్లె చుట్టూ అలుముకున్నది. బోరుబాయి మోటరు నుంచి నీళ్లు దునికి కాల్వ మడికి మళ్లింది. బీడు భూమి పచ్చబడ్డది. రైతు తెప్పరిల్లిండు.. అప్పులు తీరినయి.. ఆత్మహత్యలు ఆగినయి.. రైతన్న మొఖం జరంత తెల్లబడ్డది. నాబి సల్లగుంటే నవాబుకు జవాబు చెప్పవచ్చనే సామెత ఉండనే ఉంది కదా..! పుట్టెను ఏ పురుగు తొలిసిందో.. మనుకు ఏం బుద్ధి పుట్టిందో పంటకు నీళ్లు పెట్టిన నీరటిని అనుమానించినం. పోతున్న ఆపదను పిలిచి పీటేసినం.

గాలివాటు మీదొచ్చిన పాలకులు పరిపాలన గాలికి వదిలి ప్రతిజ్ఞలు చేస్తున్నరు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని స్మరిస్తున్నరు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామంటే తెలంగాణ అస్తిత్వాన్ని హత్య చేయపూనుకోవడమే. కేసీఆర్ ఆనవాలు లేనిదెక్కడ? వేరు తెలంగాణ ఉనికే కేసీఆర్. ఇంట్ల 24 గంటలు కరెంటు ఉండి, అది పంచిన వెలుగుజిలుగుల ఆనవాలు కేసీఆర్. కాళేశ్వరం నీళ్లతో తడిసి ముదిసిన భూ తల్లి సిరులు ప్రసవిస్తే.. ఆ ధాన్యరాశుల ఆనవాలు కేసీఆర్. పాలన గాలికొదిలేసి ఆనవాళ్లు లేకుండా చేస్తామని కుట్రలు చేయటమంటే పచ్చబడ్డ తెలంగాణ నెత్తురు తోడే దుష్ట కార్యమే. తెలంగాణలో వ్యవసాయక, పారిశ్రామిక విప్లవాన్ని తెచ్చిన కరెంటుకు అవినీతి ఆపాదించడం, విస్తృత ప్రచారంలోకి తేవడం రాజకీయ క్షుద్ర పన్నాగం. కమిషన్ విచారణ లేకుండానే నివేదిక ఇచ్చినట్టు ఆరోపణలు వస్తున్నాయి. అసెంబ్లీలో చర్చకు రాకముందే లీకులు బయటికి వస్తున్నాయి. మబ్బుల చాటున దాక్కున్న మారీచుడు వెలుగుల మీద చేస్తున్న ఈ కూట యుద్ధాన్ని తెలంగాణ జనమే తిప్పికొట్టాలె. 24 గంటల కరెంటు, కాళేశ్వరం నీళ్లు లేని నాడు బలపడ్డ శ్మశానాలే తెలంగాణకు ఆనవాళ్లుగా మిగులుతాయి. రైతన్నా తస్మాత్ జాగ్రత్త. ■

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ 11 నెలల పాలనను చూసిన వారెవరికైనా రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందనే విషయం స్పష్టంగా అర్థమవుతుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి తర్వాత అత్యంత కీలకమైన హోంశాఖ మంత్రిని ఇప్పటికీ నియమించకపోవడం ఈ రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం. 18 మందితో ఉండవలసిన మంత్రివర్గం 12 మందికే పరిమితమైంది. కీలకమైన హోం, విద్య, మైనారిటీ సంక్షేమం తదితర శాఖలు ఇప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్దనే అంటిపెట్టుకోవడంతో రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయి. ఏకంగా పోలీసులే నిరసనలు తెలిపే దుస్థితి రాష్ట్రంలో ఏర్పడటం విచారకరం. కాంగ్రెస్ తరపున గెలిచిన 65 మంది ఎమ్మెల్యేల్లో ఒక్కరూ హోంశాఖను నిర్వహించగల సమర్థుడు లేకపోవడం విడ్డూరం.

యం.డి.జమీలొద్దీన్
86862 11556

పదేండ్ల బీఆర్ఎస్ సర్కార్ శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే పోలీస్ శాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేసింది. ప్రతి పోలీస్ శాఖకు అత్యాధునిక వాహనాలను సమకూర్చింది. అంతేకాదు, స్టేషన్ల నిర్వహణకు గాను నెలవారీగా రూ.50 వేలు మంజూరు చేసింది. ఏండ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న పోలీస్ అధికారుల ప్రమోషన్ల సమస్యను పరిష్కరించింది. తద్వారా కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు మనస్ఫూర్తిగా ప్రజలకు సేవ చేశారు.

నాటి బీఆర్ఎస్ సర్కార్ నేరాలను అదుపులో పెట్టేందుకు దేశంలో ఎక్కడాలేని విధంగా లక్షల సంఖ్యలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. మహిళల రక్షణ కోసం 'షీ' టీమ్‌లను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ నగరంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

కానీ, 11 నెలల్లోనే తెలంగాణలో పరిస్థితులు తలకిందులయ్యాయి. మూడు లైంగికదాడులు, ఆరు హత్యలతో రాష్ట్రం చిన్నాభిన్నమవుతున్నది. అంతేకాదు, కలిసి మెలిసి జీవిస్తున్న హిందూ-ముస్లిం సోదరుల మధ్య వైరం సృష్టించే ప్రయత్నాలు జరుగుతుండటం హేయనీయం. బక్రీద్ సందర్భంగా మెదక్ పట్టణంలో చెలరేగిన అల్లర్లు అలాంటివే. ఇటీవల సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ గుడిలో జరిగిన అత్యంత హేయమైన ఘటనను ఖండించాల్సిందే. ఇలా వరుస ఘటనలు పోలీస్ శాఖ వైఫల్యాన్ని ఎత్తిచూపుతున్నాయి.

జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు గంగారెడ్డిని పట్టపగలే హత్య చేయడం అమానుషం. 'ఈ రాష్ట్రంలో శాంతిభద్రతలున్నాయా?' అని అధికార పార్టీ ఎమ్మెల్సీ రోడ్డుపై ధర్నాకు దిగడం పోలీసు శాఖలోని లోపాలను తెలియపరుస్తున్నాయి.

అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు రాష్ట్రంలో ఒకే తరహా పోలీస్ విధానాన్ని తీసుకువస్తామని రేవంత్ రెడ్డి మాటిచ్చారు. ఆయన మాట తప్పడంతో పోలీస్

కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేశారు. బెటాలియన్ కానిస్టేబుళ్లు ఏకంగా యూనిఫాంతో నిరసనలు తెలపడం ఆందోళనకరం.

అన్ని వసతులున్న ప్రగతిభవన్‌లో తాను ఉండనని భేషజాలకు పోయిన రేవంత్‌రెడ్డి... శాంతిభద్రతల పరిరక్షణకు వాడవలసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను తన మీటింగ్ హాల్‌గా ఉపయోగించుకోవడం అత్యంత దారుణం. ఆయన చర్యల వల్ల పోలీస్ శాఖ విధులకు ఆటంకం కలుగుతున్నది. నేరాల అదుపుకు వినియోగించాల్సిన పోలీస్ శాఖను ప్రతిపక్ష నాయకులు, పౌరహక్కుల నేతలపై కక్ష సాధింపునకు వాడుతుండటంతో రాష్ట్రంలో ఖర్మ్యా వాతావరణం నెలకొన్నది. పోలీస్ స్టేషన్లలో అధికార పార్టీ నేతల పుట్టినరోజు వేడుకలు జరపడం, మంత్రుల బర్త్ డేలకు ఏసీపీ స్థాయి అధికారులు రోడ్లపై కేకులు కోయడం లాంటి కుత్సిత పనుల కారణంగా పోలీస్ శాఖ పలుచనవుతున్నది.

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించిన నేపథ్యంలో ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ తన తీరును మార్చుకోవాలి. వెంటనే హోంశాఖ మంత్రిని నియమించాలి. ప్రతిపక్షాలను, ప్రశ్నించే గొంతు కలను వేధించడానికి కాకుండా నేరాల అదుపునకు మాత్రమే పోలీసు శాఖను వాడుకోవాలి. రాష్ట్రంలో శాంతిభద్రతలను అదుపులో పెట్టకపోతే రేవంత్‌రెడ్డి ఒక అసమర్థ ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోవడం ఖాయం.

దేశంలోనే నెంబర్‌వన్ ప్రభుత్వరంగ సంస్థకు నామినేషన్ పద్ధతిలో ఇచ్చామా? టెండర్ పద్ధతిలో ఇచ్చామా? అనేది ఇక్కడ ప్రశ్నే కాదు. ఎట్లా ఇచ్చినా అది చట్టబద్ధమే. దీనిమీద రాద్ధాంతం చేయడం అంత బుద్ధిహీనమైన పని ఇంకోటి ఉండదు. తెలంగాణ రైతాంగ పరిస్థితి, పరిశ్రమల మనుగడ క్రిటికల్ పొజిషన్‌లో ఉన్నప్పుడు.. సబ్ క్రిటికల్, సూపర్ క్రిటికల్ అనే శాస్త్రీయ పదాల మీది తర్కం రైతు ఆత్మహత్యలను ఆపగలదా? ఆపదలో ఉన్న పారిశ్రామిక, వ్యవసాయరంగాలను ఆదుకోగలదా?



ఇలాంటి ప్రభుత్వాన్ని చూడలేదు!

నా 62 ఏండ్ల సుదీర్ఘమైన రాజకీయ జీవితంలో ఇలాంటి ప్రభుత్వాన్ని (కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కార్) ఎన్నడూ చూడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చెర నుంచి కర్ణాటకను కాపాడాల్సిన అవసరమున్నది. నాకిప్పుడు 92 ఏండ్లు. అయినా సిద్ధరామయ్య సర్కార్‌ను గద్దెదించేంత వరకు నేను విశ్రాంతి తీసుకోను. నా చివరి శ్వాస వరకు రాజకీయాల్లోనే ఉంటా. పోరాడుతూనే ఉంటా.

- దేవేగౌడ, మాజీ ప్రధాని

తెలంగాణ పల్లెల్లో ఊరి పెత్తందారును 'దొర' అంటారు. పట్వారీ (కరణం) కావచ్చు, మోతుబరి ఆసామీ కావచ్చు 'దొర' అనే పిలుస్తారు. కానీ, ఇప్పుడు దళితుల్లో దొరలున్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పుణ్యమాని ఎదిగినవారు కూడా దొరల లాగానే వ్యవహరిస్తున్నారు. ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా పనిచేసిన కవులు, రచయితలు, మేధావులు మూలాలను మరిచి తమకంటే కింది ప్రజలను అవహేళనగా చూస్తూ అవమానపరుస్తున్నారు. ఇక దళిత ప్రజాప్రతినిధుల గురించి చెప్పనక్కర్లేదు. వాళ్లకూ, ఊరి పెత్తందారులకు తేడా లేనే లేదు.

ఇంతకీ దొరలెవరు?

ఎదిరెపల్లి కాశన్న

పెత్తందారుల బాటలోనే దళిత ప్రజాప్రతినిధులు నడుస్తున్నారు. అంబేద్కర్ భావజాలం ఉన్నవాళ్లు, ప్రజా ఉద్యమాల్లో పనిచేసినవారు కూడా కింది కులాల ప్రజలను గౌరవించడం లేదు. కొంత మంది సాహితీవేత్తలు 'మేము మహా కవులం' అని పేట్రేగిపోతున్నారు. ఇక్కడ చెప్పేదేమంటే మీరు ఎదిగినందుకు ఎవరూ ఏడ్వడం లేదు. మమ్మల్ని చిన్న చూపు చూస్తున్నందుకే బాధగా ఉన్నది. ఆ బాధతోనే ఈ మూడు ముక్కలు రాస్తున్నాను.

ఏ మూలాల నుంచి వచ్చామో, ఆ మూలాలను మరిచిపోతున్నాం. రాజ్యాంగ ఫలాలను దక్కకుండా చేసేవాళ్లను దొరలు, పెత్తందార్లు అన్నప్పుడు, దళితులలో ఇలాంటివి అనుసరిస్తున్న వారిని ఏమనాలి? మనం బుద్ధుని, మార్క్స్, నారాయణ గురు, పెరియార్, కబీర్, పూలే, అంబేద్కర్, కాన్షీరాంల గురించి మాట్లాడుతుంటాం. సమానత్వం, హక్కులు, రాజ్యాధికారం గురించి కొట్లాడుతున్నాం. ఆకలి, అవమానం, ఆత్మగౌరవం కోసం పోరాటం చేస్తున్నాం. అంబేద్కర్ చెప్పినట్టు విమర్శ కంటే ఆత్మవిమర్శ గొప్పది. ఆత్మవిమర్శ చేసుకోనప్పుడు నీవు రాజువైతే ఏమీ, మంత్రివైతేనేమీ, కవివి అయితేనేమీ? అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ల పుణ్యమాని చట్టసభలకు ఎన్నికైన దళిత ప్రజాప్రతినిధులు రాజ్యాంగబద్ధంగా దళితుల అభ్యున్నతికి ఎంత ఖర్చుచేశారో లెక్కలతో సహా చూపించగలరా? ఇంకా దారుణం ఏమంటే.. ఎమ్మెల్సీ, రాజ్యసభకు నామినేట్ అయిన దళిత ప్రజాప్రతినిధులు వాళ్లకు కేటాయించిన నిధులను 99 శాతం అగ్రకుల వ్యక్తుల ప్రయోజనాల కోసం ఖర్చు చేస్తున్నారు. ఇది నిజం కాదా? కాదంటే శ్వేతపత్రం విడుదల చేస్తారా? ఇంకా ఘోరం ఏమంటే.. ప్రజల చేత, ప్రజల కొరకు ఎన్నికైన దళిత ప్రజాప్రతినిధుల ఇండ్లల్లోకి దళితులకే ప్రవేశం ఉండదు. అదే, దొరలో, రెడ్డి బాబులకైతే సులువుగా ప్రవేశం దొరుకుతుంది. అగ్రకుల నాయకులు ఒకసారి కాకపోతే ఒకసారి ఇంటికి పోతే గౌరవం ఇస్తారు. కానీ, దళిత ప్రజా ప్రతినిధులు మాత్రం అసలుకే పట్టించుకోరు. ఇప్పటికైనా మీ పద్ధతులను మార్చుకోండి. మన జాతి పేద ప్రజలకు గౌరవం ఇచ్చి అవకాశాలు క